
రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త



## నాదర్గుల్ భూములపై సమగ్ర విచారణ జరపాలి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని నాదర్గుల్ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములపై సమగ్ర విచారణ జరపాలని కోరుతూ బిఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు శుక్రవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. నాదర్గుల్‌లోని సర్వే నంబర్ 613లో సుమారు 373 ఎకరాల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని వారు జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డికి లిఖితపూర్వకంగా వివరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, స్థానిక శాసనసభ్యురాలు పి. సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే కెపి వివేకానంద, ఎమ్మెల్సీలు దాసోజు శ్రావణ్, వాణీదేవి, జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పట్నం నరేందర్ రెడ్డి, అంజయ్య యాదవ్ తదితరులు అదనపు కలెక్టర్‌తో సుదీర్ఘంగా చర్చించారు. ఈ భూముల విషయంలో జిల్లా అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి, అక్రమంగా కబ్జాకు గురవుతున్న భూములను ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకోవాలని వారు డిమాండ్ చేశారు. సర్వే నంబర్ 613లో కాంగ్రెస్ నాయకులు భూ అక్రమాలకు పాల్పడుతున్నారని, బౌన్సర్లు, గుండాలను మోహరించి ఒక మంత్రి పేరు చెప్పుకుంటూ భూ కబ్జాలు చేస్తున్నారని బిఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ఆరోపించారు. అంతేకాకుండా, అక్కడ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న రైతుల భూములను కబ్జా చేస్తూ, వారిని బెదిరించి దాడులకు పాల్పడుతున్నారని బిఆర్ఎస్ నేతలు వివరించారు. ప్రభుత్వ భూముల్లో అక్రమంగా షెడ్లు వేస్తున్నా కాంగ్రెస్ నాయకులపై అధికారులు ముఖ్యంగా ఆర్డీవో మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు. సీలింగ్ యాక్ట్‌కు తూట్లు పొడుస్తూ ప్రభుత్వానికి నష్టం కలిగిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వం తక్షణమే ఉన్నత స్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేశారు.



ఫిర్యాదు చేస్తున్న మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు

## పెళ్లికి నిరాకరించిందని హెచ్ఐవీ ఇంజక్షన్

- ఓ ఉన్మాది వికృత శిక్ష
- అవమాన భారంతో యువతి ఆత్మహత్య



తనను కాదన్న యువతిపై పగ తీర్చుకోవడానికి హెచ్ఐవీ రక్తాన్ని ఆయుధంగా వాడుకున్నాడు ఓ కిరాతకుడు. సాంకేతిక యుగంలో ఉన్మాదులు ఎంత క్రూరంగా మారుతున్నారో చెప్పడానికి ఈ ఘటనే నిదర్శనం. తన రక్తంలోకి బలవంతంగా ప్రాణాంతక వ్యాధిని ఎక్కించిన ప్రియుడి వికృత చేష్టలను భరించలేక, బాధితురాలు తన జీవితాన్ని అర్ధాంతరంగా ముగించుకుంది. సంఘటనా స్థలంలో లభించిన రెండు పేజీల సూసైడ్ నోట్ ఆమె పడ్డ వేదనను కళ్ళకు కడుతోంది.

ఈ హృదయవిదారక ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అన్నోజిగూడలో చోటుచేసుకుంది.

వివరాలు మెయిన్‌లో

## మృత్యుపాశం బిగించిన ప్రేమోన్మాదం

### తమ్మలోనిగూడలో యువతి బలవన్మరణం
### డెత్ నోట్ రాసి తనువు చాలించిన బాలిక
### నిందితుడి వేధింపులే కారణమని ఆవేదన

**యాచారం, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** ప్రేమ ఉన్మాదానికి మరో నిండు ప్రాణం బలైంది. ప్రేమించాలంటూ ఓ యువకుడు వేధిస్తుండటంతో మనస్తాపానికి గురైన ఓ బాలిక ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న హృదయవిదారక ఘటన యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని తమ్మలోనిగూడ గ్రామానికి చెందిన మస్కు యాదయ్యకు ముగ్గురు కుమార్తెలు. వారిలో మూడవ కుమార్తె (17) ఇటీవలే ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఇంటి వద్దే ఉంటోంది. అయితే, అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు గత కొంతకాలంగా ఆమెను ప్రేమించాలంటూ వేధిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గురువారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆ వేధింపులు భరించలేక సదరు యువతి ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులకు యువతి రాసిన సూసైడ్ నోట్ లభ్యమైంది. అందులో సదరు యువకుడి వేధింపుల వల్లే తాను ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు ఆమె పేర్కొన్నట్లు పోలీసులు గుర్తించారు. సీఐ నందీశ్వర్ రెడ్డి ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



సస్పెన్షన్ వివరాలు వెల్లడిస్తున్న మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేశ్ తదితరులు

### అలియాబాద్ కాంగ్రెస్‌లో
## సస్పెన్షన్ వేటు!
### మున్సిపల్ ఎన్నికలలో ప్రత్యర్థులకు మద్దతు ఇచ్చారని.. నలుగురు నాయకుల బహిష్కరణ

**శామీర్పేట, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** ఇటీవల జరిగిన అలియాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పనిచేసి, ఇతర పార్టీల అభ్యర్థులకు మద్దతుగా నిలిచిన నలుగురు నాయకులను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేశ్ ప్రకటించారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించి, సంస్థకు నష్టం కలిగించేలా వ్యవహరించిన వారిపై అధిష్టానం కఠిన చర్యలు తీసుకుందని ఆయన స్పష్టం చేశారు.

**వేటు పడింది వీరిపైనే..**

మున్సిపల్ ఎన్నికల సమయంలో పార్టీ అభ్యర్థుల విజయానికి సహకరించకుండా, ప్రత్యర్థి పార్టీల గెలుపు కోసం కృషి చేసినందుకు గాను..ముద్దం కిట్టు కుమార్‌రెడ్డి, జమాల్పూర్ సంతోష్, ముద్దం రాజారెడ్డి, సంగమైన వినోద్‌లను పార్టీ నుంచి బహిష్కరించారు.

**పార్టీకి నష్టం కలిగిస్తే ఎంతటివారికైనా ఇంతే..**

స్థానిక నాయకుల మిగతా 2లో

### అమ్మపై
## అరాచకం
### ఇంట్లోంచి గెంటేసి.. రోడ్డుపై చావబాది!
### ఆస్తి కోసం కొడుకు కర్కశత్వం
### షాద్‌నగర్‌లో దారుణం

**షాద్‌నగర్ టౌన్, ప్రభాతవార్త:** నవమాసాలు మోసి కన్నతల్లి అని కూడా చూడకుండా, ఆస్తి వివాదంతో ఓ కొడుకు కనికరం లేకుండా దాడికి పాల్పడిన ఘటన షాద్‌నగర్ పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలో నివాసముంటున్న నాగులపల్లికి చెందిన చాకలి రాములమ్మపై ఆమె కుమారుడు రాజు విచక్షణారహితంగా దాడి చేశాడు. స్థానిక హెచ్‌పి గ్యాస్ ఏజెన్సీలో పనిచేస్తున్న రాజు, నాగులపల్లిలో ఉన్న ఇంటి విషయంలో గొడవ పెంచుకుని గతంలో రెండుసార్లు తల్లిపై చేయి చేసుకున్నాడు. తాజాగా గురువారం బహిరంగంగా అందరూ చూస్తుండగానే ఆమెను చావబాదాడు. బాధితురాలు రాములమ్మ కథనం ప్రకారం.. కొడుకుకు పెళ్లయ్యాక తనను ఇంటి నుండి బయటకు గెంటేశాడని, గడిచిన ఏడాది కాలంగా అద్దె ఇంట్లో ఉంటూ, ఇతరుల ఇళ్లలో పాచి పని చేసుకుని పొట్ట పోసుకుంటున్నానని కన్నీరుమున్నీరైంది.



బాధితురాలు రాములమ్మ

గతంలో ఇస్త్రీ డబ్బాలో తలదాచుకున్న తన దీనస్థితిని చూసి, స్థానిక నాయకుల సహకారంతో ప్రభుత్వం ఇటీవల ఒక ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసిందని చెప్పింది. ఈ నీడ దొరికినప్పటికీ, రాజు ఏదో ఒక నెపంతో తనను టార్గెట్ చేస్తూ దాడి కొనసాగిస్తున్నాడని వాపోయింది. స్థానికులు అడ్డుపడి ఆమెను రక్షి ంచి, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయమని సూచించడంతో షాద్‌నగర్ పోలీసులను ఆశ్రయించానని చెప్పింది. అయితే, ఫిర్యాదు తీసుకున్న పోలీసులు నువ్వు వెళ్ళు, మేము చర్యలు తీసుకుంటాం అని చెప్పి వదిలేశారని, ఇప్పటివరకు తనకు న్యాయం చేయలేదని మిగతా 2లో

### ఇండస్ట్రియల్ పార్కుకు భూసేకరణ ప్రారంభం
### మూడు తరాల బతుకుతెరువు.. మూటగట్టి సర్కారు పాలు చేస్తారా?
### ప్రజాభిప్రాయ సేకరణలో దుద్యాల రైతుల ఆవేదన
### లగచర్లకు మించి పరిహారం ఇవ్వాలని పట్టు



ప్రజాభిప్రాయ సేకరణ సదస్సుకు హాజరైన రైతులు

## 500 ఎకరాలపై నజర్

**దుద్యాల్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు ప్రభుత్వం అడుగులు వేగవంతం చేసింది. దుద్యాల్ మండల కేంద్రంలోని 363 సర్వే నెంబర్‌లో గల 139 ఎకరాల 38 గుంటల భూమికి తోడు, పక్కనే ఉన్న నారాయణపేట జిల్లా కోస్గి మండలం తొగాపూర్ గ్రామానికి సంబంధించిన 360 ఎకరాలను కలిపి మొత్తం 500 ఎకరాల భూసేకరణ కోసం అధికారులు రంగం సిద్ధం చేశారు. ఈ మేరకు నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ సభలో రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. 'సుమారు 75 సంవత్సరాలుగా మా తాతల నుంచి నేటి వరకు ఈ భూమిపైనే ఆధారపడి బ్రతుకుతున్నాం' అని రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. తమ పిల్లలు డిగ్రీలు, బీటెక్కులు చదివినా ఉపాధి లేక మళ్లీ వ్యవసాయమే చేస్తున్నారని, తాము పిల్లలకు ఇచ్చే ఏకైక ఆస్తి ఈ భూమి మాత్రమేనని ఆవేదన వ్యక్తం చేశారు. సాగులో ఉన్నా పాసుబుక్కులు లేని వారికి, పాసుబుక్కులు ఉన్నా సాగులో లేని వారికి అధికారులు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

గతంలో లగచర్ల, హకీంపేట్, పోలేపల్లి గ్రామాల్లో భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం ఎకరానికి 20 లక్షలు, 150 గజాల ఇంటి స్థలం, ఇందిరమ్మ ఇల్లు మరియు అర్హతను బట్టి ఇంటికో ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. తమకు అంతకంటే అధికంగా పరిహారం ఇచ్చి, తమ కుటుంబాలకు శాశ్వత ఉపాధి కల్పిస్తేనే భూములిస్తామని రైతులు తేల్చి చెప్పారు.

**నెగోషియేషన్ కమిటీదే తుది నిర్ణయం : ఆర్డీఓ**

ఆర్డీఓ కర్ర అనిత మాట్లాడుతూ, రైతులు ఎంజాయ్‌మెంట్ సర్వేలో పాల్గొని తమ భూముల హద్దులు చూపించాలని కోరారు. అనంతరం కలెక్టర్ అధ్యక్షతన నెగోషియేషన్ కమిటీ రైతులతో చర్చించి తుది పరిహారం నిర్ణయిస్తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ కిషన్, ఇతర రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. సభలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సుమారు 30 మంది పోలీసు సిబ్బందితో భారీ బందోబస్తు నిర్వహించారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ అనత

## వైద్య సేవలపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

### ఎల్లమ్మబండ ఆరోగ్య కేంద్రం సందర్శన
### మందుల పంపిణీలో అప్రమత్తంగా ఉండాలి
### ఎక్స్‌పైరీ డేట్ చెక్ చేయాలని ఆదేశం
### వ్యాక్సినేషన్, ఇమ్యునైజేషన్ సేవలపైనా సమీక్ష

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 10, ప్రభాతవార్త :** ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి శుక్రవారం కూకట్‌పల్లి ఎల్లమ్మబండలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఆసుపత్రిలోని మౌలిక సదుపాయాలను స్వయంగా పరిశీలించిన ఆయన, రోజువారీ ఓపి వివరాలను వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో ఆశా వర్కర్ల కొరత ఉందని మెడికల్ ఆఫీసర్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఆసుపత్రికి అదనపు గదులు, టాయిలెట్లు అవసరమని అధికారులు కోరగా, వెంటనే మరమ్మతులు మరియు నిర్మాణాలకు సంబంధించి అంచనాలు వేసి ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ సూచించారు. అనంతరం ఆసుపత్రి రికార్డులను, రిజిస్టర్లను తనిఖీ చేసిన ఆయన, వ్యాక్సినేషన్ ఇమ్యూనైజేషన్ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఔషధాల నిల్వలను సమర్థవంతంగా నిర్వహించాలని, ఎమర్జెన్సీ కార్నర్ ఎప్పుడూ సిద్ధంగా ఉండాలని ఫార్మాసిస్ట్‌ను ఆదేశించారు. ముఖ్యంగా రోగులకు మందులు ఇచ్చే సమయంలో ఎక్స్‌పైరీ డేట్ తప్పనిసరిగా తనిఖీ చేయాలని స్పష్టం చేశారు. ఆసుపత్రి అభివృద్ధికి అవసరమైన నిధులను సమకూరుస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ హామీ ఇచ్చారు.



ఎల్లమబండ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ మనుచౌదరి

## హరీష్ చెప్పేవన్నీ అబద్ధాలే

### పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల 80 శాతం కూడా పూర్తి కాలేదు
### ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**షాద్‌నగర్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త :** తెలంగాణలో హరీష్ రావు పెద్ద బ్లాక్ మెయిలర్‌గా మారాడని అబద్ధాల అవార్డును మాజీ మంత్రి హరీష్ రావుకు ఇవ్వచ్చని షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలోనీ సిఎల్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. పాలమూరు- రంగారెడ్డి మిగతా 2లో



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్. ఫొటోలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే మధుసూదన్

## 50 ట్రాక్టర్ల ఇసుక సీజ్

### అక్రమ ఇసుక నిల్వలపై పోలీసుల మెరుపుదాడులు
### భారీగా పట్టుబడ్డ ఇసుక డంపులు

**పెద్దేముల్, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపులపై పోలీసులు మెరుపుదాడులు నిర్వహించి, సుమారు 50 ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేశారు. ఎస్ఐ ప్రశాంత్వర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దేముల్ మండల పరిధిలోని మదనంతాపూర్ తండా మరియు కొండాపూర్ గ్రామాల శివారులో భారీగా ఇసుకను నిల్వ ఉంచినట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ సమాచారంతో శుక్రవారం తన సిబ్బందితో కలిసి మెరుపుదాడులు నిర్వహించిన ఎస్ఐ, అక్కడి ఇసుకను స్వాధీనం చేసుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు వెల్లడించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను అక్రమంగా నిల్వ చేసినా లేదా రవాణా చేసినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ రఫీ, కొండాపూర్ విఆర్ఎ వెంకటయ్య, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



సీజ్ చేసిన ఇసుక డంపు



మొదల్లగూడలో క్రీడా ప్రాంగణం దుస్థితి ధ్వంసమైన ఇనుప పైపులు

## లక్షల నిధులు గాలికి..!

### బోర్డులకే పరిమితమైన క్రీడా ప్రాంగణాలు
### అంతర్జాతీయ యూనివర్సిటీ నీడన.. అస్తవ్యస్త స్థితి!
### యువతకు తప్పని నిరాశ
### పట్టించుకోని యంత్రాంగం..

**నందిగామ, ఏప్రిల్ 10 ప్రభాతవార్త :** గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయాలని, వారికి మెరుగైన వసతులు కల్పించాలనే ఉన్నత లక్ష్యంతో 2022లో అప్పటి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. కానీ, క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ లోపం, అధికారుల నిరక్ష్యం వెరసి ఈ ప్రాంగణాలు నేడు నిరుపయోగంగా మారి, ప్రజాధనం వృథా అవుతోంది. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం మొదల్ల గూడ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న క్రీడా ప్రాంగణం దుస్థితి ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. ఆశ్చర్య కరమైన విషయమేమిటంటే, ప్రపంచ స్థాయి ప్రమాణాలతో విరాజిల్లుతున్న సింబాసిస్ అంతర్జాతీయ యూనివర్సిటీకి కూతవేటు దూరంలోనే ఈ ప్రాంగణం ఉంది. దారి వెంట వెళ్లే బాటసారులు అక్కడ ధ్వంసమై వేలాడుతున్న బోర్డును చూసి, ఇదేమి నిరక్ష్యం? అని ముక్కున వేలేసుకుంటున్నారు. ప్రభుత్వం లక్షలాది రూపాయల నిధులను వెచ్చించి ఈ ప్రాంగణాలను నిర్మించినప్పటికీ, కనీస నాణ్యత పాటించకపోవడంతో పనులు అస్తవ్యస్తంగా మారాయి. ప్రస్తుతం అక్కడ ఆటస్థలం ఊసే లేదు. కేవలం ధ్వంసమైన బోర్డులు, తుప్పు పట్టిన ఇనుప పైపులు మాత్రమే మిగిలి ఉన్నాయి. క్రీడల ద్వారా భవిష్యత్తును వెతుక్కుందామనుకున్న గ్రామీణ యువతకు ఈ ప్రాంగణం ఏమాత్రం ఉపయోగపడటం లేదు. గ్రామపంచాయతీకి అతి సమీపంలోనే ఈ ప్రాంగణం కనుమరుగవుతున్నా, అటు అధికారులు కానీ, ఇటు ప్రజాప్రతినిధులు కానీ పట్టించుకున్న దాఖలాలు లేవని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**నాకేమీ తెలియదు : పంచాయతీ కార్యదర్శి**

ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి జానకిరామ్‌ను వివరణ కోరగా, తనకేమీ తెలియదని, చూస్తానని.. అత్యంత నిరక్ష్యంగా సమాధానం ఇచ్చారు.

**పునరుద్ధరణ ఎప్పుడు?**

పాలకుల నిరక్ష్యం, అధికారుల ఉదాసీనత వల్ల క్రీడా ప్రాంగణాలు కేవలం ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి, మొదల్లగూడలోని క్రీడా ప్రాంగణాన్ని పునరుద్ధరించి, యువతకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.





## నందిగామలో ముదిరాజ్ నాయకుల అరెస్టు

**నందిగామ, ఏప్రిల్ 10 ప్రభాతవార్త :** ముదిరాజ్ కులస్తులకు జరుగుతున్న అన్యాయాలపై గళమెత్తుతూ, తమ డిమాండ్ల సాధన కోసం ముదిరాజ్ సంఘం శుక్రవారం పిలుపునిచ్చిన హలో ముదిరాజ్ ఛలో గాంధీ భవన్ ముట్టడి సందర్భంగా నందిగామ మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు మెక్కం రాజు ముదిరాజ్, నర్సప్పగూడ నీరటి సురేందర్‌ను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా మెక్కం రాజు ముదిరాజ్ మాట్లాడుతూ సమస్యలపై పోరాడితే అరెస్టు చేయడం తగదన్నారు. ఆర్థిక సామాజిక రాజకీయ రంగాలలో వెనుకబడిన ముదిరాజ్‌లను వెంటనే బిసిడి నుండి బిసిఏ జాబితాలోకి మార్చాలని డిమాండ్ చేశారు. ప్రశ్నించే గొంతుకను నొక్కడం, అక్రమ నిర్బంధాలకు.. ముందస్తు అరెస్టులకు భయపడే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

## ఆలయ వార్షికోత్సవాన్ని విజయవంతం చేయండి

**నందిగామ, ఏప్రిల్ 10, ప్రభాతవార్త :** నందిగామ మండల కేంద్రంలో ఉన్న మహిమాన్విత శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలను గురుస్వామి గిరిష్ నాయర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ జిల్లెల బాల్ రెడ్డి తెలిపారు. ప్రతిరోజు పూజా కార్యక్రమం అనంతరం మధ్యాహ్నం అన్నదాన వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మహా కార్యక్రమానికి కేరళ అయ్యప్ప దేవాలయ తాంత్రిక పూజారులు హాజర పుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అయ్యప్ప భక్తులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.





సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

## సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**దుద్యాల్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** సైబర్ మోసాలా పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దుద్యాల్ పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించారు. నకిలీ లోన్ యాప్‌ల ద్వారా లోన్లు ఇస్తామని, పోలీసులం, అధికారులం అని చెప్పి డబ్బులు వసూలు చేయడం. నకిలీ వాట్సాప్ ప్రొఫైల్ సృష్టించి అధికారులు, బంధువుల పేర్లతో డబ్బులు అడగడం, తక్కువ వడ్డీకి లోన్ ఇప్పిస్తామని చెప్పడం వంటి వివిధ రకాలుగా మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. బ్యాంకు నుండి కాల్ చేస్తున్నాం. ఈకేవైసీ చేయాలి, ఫ్రీగా క్రెడిట్ కార్డ్ వస్తుందని వెంటనే డబ్బులు వాడుకోవచ్చని చెబితే నమ్మవద్దని అన్నారు. తెలియని నంబర్ల నుండి వచ్చే కాల్స్, వీడియోస్ లను నమ్మవద్దని మీ బ్యాంక్ వివరాలు ఓటీపీ, పిన్ నెంబర్లను ఎవరికి చెప్పవద్దని, వాట్సాప్ లో డబ్బులు అడుగుతే ముందుగా సంబంధిత వ్యక్తికి కాల్ చేసి నిర్ధారించుకోవాలని ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కి కాల్ చేయాలని సూచించారు.

## కౌన్సిలర్లకు తగిన ప్రాధాన్యత ఇవ్వండి

**తాండూరు, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** తాండూరు మునిసిపాలిటిలో ప్రజాస్వామ్య విరుద్ధ చర్యలను మానుకోవాలని, కౌన్సిలర్లకు తగిన ప్రాధాన్యత ఇచ్చి ప్రోటోకాల్ పాటించే విధంగా చూడాలని కౌన్సిలర్ ఇర్షాద్ డిమాండ్ చేశారు. తాండూరు మునిసిపాలిటిలో ప్రజాస్వామ్య విరుద్ధ చర్యలు, బిఆర్ఎస్ కౌన్సిలర్లను పక్కన పెట్టడంపై కౌన్సిలర్లు జావిద్, సురేష్, యోగానంద్ తదితరులతో కలిసి శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంజాన్ నెల సందర్భంగా ప్రభుత్వం అందించిన రంజాన్ తోఫా పంపిణీ విషయంలో బిఆర్ఎస్ పార్టీ తరపున ఎన్నికైన కౌన్సిలర్లకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని ఆరోపించారు. కేవలం అధికార పార్టీ నాయకుల ద్వారానే పంపిణి చేసారని, అందుకు తమ వద్ద పూర్తి ఆధారాలు ఉన్నాయని అన్నారు. డబుల్ బెడ్ రూంఇండ్ల పంపిణి విషయంలో అధికార పార్టీకి చెందిన ఓడిపోయిన కార్యకర్తల ద్వారా వెరిపికేషన్ చేయించి ఇళ్ళను కేటాయించడానికి సిద్దమయ్యారని అన్నారు. ఇది నిజమైతే ప్రజాస్వామ్యానికి విరుద్ధమని, ప్రోటోకాల్ ఉల్లంగన అవుతుందని అన్నారు. మునిసిపాలిటిలో జరిగే అధికారిక కార్యక్రమాలకు ఎన్నికైన కౌన్సిలర్లను పక్కన పెట్టి, అధికార పార్టీకి చెందిన నాయకులకు ప్రాధాన్యత ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇది ఎన్నికైన ప్రతినిధుల గౌరవాన్ని అవమానపరిచే చర్యలని, ప్రజాస్వామ్య విలువలకు భంగం కలిగించే విధంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. డబుల్ బెడ్ రూంఇండ్ల విషయంలో పారదర్శకంగా ఉండాలని, రంజాన్ తోఫా పంపిణీ విషయంలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పిర్యాదు చేసిన వారిలో కౌన్సిలర్లతో పాటు బిఆర్ఎస్ నాయకులు రుద్రుపాటిల్,సంతోష్ గౌడ్, ఏజాజ్, అనంత్‌రెడ్డి, సంతోష్ తదితరులు ఉన్నారు.

## అమ్మపై అరాచకం

(మొదటి పేజీ తరువాయి)

వాపోయింది. ఈ విషయంలో ఒక స్థానిక పెద్దాయన నిందితుడిని కాపాడుతున్నాడని, తన నోరు విప్పితే ఆ పెద్దాయన జీవితం కూడా బట్టబయలు అవుతుందని ఆమె పేర్కొంది. తన భర్త కూడా ఎన్నడూ కొటలేదని.. కన్న కొడుకే చంపేస్తాడేమోనని ఆందోళన వ్యక్తంచేసింది. పోలీసులు వెంటనే స్పందించి బాధితురాలికి న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## సస్పెన్షన్ వేటు!

(మొదటి పేజీ తరువాయి)

ఫిర్యాదులను తీవ్రంగా పరిగణించిన మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిసిసి) అధ్యక్షులు తోటకూర వజ్రేశాయాదవ్, సదరు నాయకులను సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ ఉత్తర్వులు వెంటనే అమలు లోకి వస్తాయని అధిష్టానం వెల్లడించింది. కాం గ్రెస్ పార్టీకి నష్టం కలిగించే ఏ నాయకుడైనా సరే, పదవులతో సంబంధం లేకుండా క్రమ శిక్షణ చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా నాయకులు హెచ్చరించారు. ఈ కార్య క్రమంలో మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేశ్‌తో పాటు కంఠం కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు ముద్దం సుదాకర్ రెడ్డి, ఎస్. జశ్వంత్రెడ్డి, మేడ్చల్ ఎఎంసి డైరక్టర్ తుంకి బిక్షపతి, నర్సింగ్రావుగౌడ్, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇంకో రెండు నెలలే గడువు

**ప్రభుత్వ ఆసుపత్రి పనులపై ఈఈ డెడ్‌లైన్**

**ఆమనగల్లు, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** కార్యక్రమంలో డీఈ కోటయ్య, కేఎస్‌ఆర్ సేవా దళం అధ్యక్షులు మెకానిక్‌బాబా, సైట్ ఇంచార్జి శంకర్, బాలకృష్ణ, గడిగె శ్రీను తదితరులు ఉన్నారు. ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామ్మోహన్‌రెడ్డి శుక్రవారం సందర్శించారు. పనుల పురోగతిని సమీక్షించారు. జూన్ 2వ తేదీన భవన ప్రారంభోత్సవానికి ప్రణాళికలు రూపొంది



స్తున్నందున, ఆలోపే పనులన్నీ పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. జాతీయ వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో రూ. 17.50 కోట్ల నిధులతో, 50 పడకల సామర్థ్యంతో ఈ నూతన భవనాన్ని నిర్మిస్తున్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రత్యేక చొరవతో పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ ఆసుపత్రి అందుబాటులోకి వస్తే ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి మండలాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయి. ఈ కార్యక్రమంలో డీఈ కోటయ్య, కేఎస్‌ఆర్ సేవా దళం అధ్యక్షులు మెకానిక్ బాబా, సైట్ ఇంచార్జి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## హరీష్ చెప్పేవన్నీ అబద్ధాలే

(మొదటి పేజీ తరువాయి)

ఎత్తిపోతల పథకం పనులపై మాజీ మంత్రి టి. హరీష్ రావు చేసిన వ్యాఖ్యలపై షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. 80 శాతం పనులు పూర్తయ్యాయి.. అన్న హరీష్ రావు వ్యాఖ్యలు ప్రజలను మోసం చేయడమేనని ఆయన ధ్వజమెత్తారు. పథకం పనులు 80 శాతం పూర్తయ్యాయని చెప్పడం పచ్చి అబద్ధమని, వాస్తవానికి 80 శాతం పనులు పూర్తికాలేదని స్పష్టం చేశారు. పనులు పూర్తికాకపోయినా, నిధులు మాత్రం 80 శాతం దోచుకున్నారనే అనుమానాలు ప్రజల్లో బలంగా ఉన్నాయి" అని తీవ్ర ఆరోపణలు గుప్పించారు.హరీష్ రావు నిరాధార ఆరోపణలు, అబద్ధాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించిన శంకర్,"సిగ్గు, శరం లేకుండా మాట్లాడటం ఆయనకు అలవాటైపోయింది" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. అబద్ధాలపై అవార్డులు ఇస్తే ప్రపంచ స్థాయి అవార్డు హరీష్ రావుకే వస్తుంది" అని ఎద్దేవా చేశారు.ఇక కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీష్ రావు చేస్తున్న విమర్శలను కూడా ఆయన ఖండించారు.ప్రజలు కాంగ్రెస్‌పై నమ్మకం ఉంచారు. రాబోయే పదేళ్లు కాంగ్రెస్ అధికారంలోనే ఉంటుంది" అని ధీమా వ్యక్తం చేశారు. 80 వేల పుస్తకాలు చదివానని చెప్పుకునే వ్యక్తి , ఆ పుస్తకాలన్నీ అబద్ధా చెప్పేందుకేనంటూ అంటూ వ్యంగ్యంగా ప్రశ్నించారు.ప్రజల అభివృద్ధి కంటే రాజకీయ లాభాల కోసం తప్పుడు ప్రచారం చేయడం తగదని హెచ్చరించారు. పాలమూరు-రంగారెడ్డి పథకం వంటి కీలక ప్రాజెక్టులపై వాస్తవాలను దాచిపెట్టి ప్రచారం చేయడం ప్రజలను మోసం చేయడమేనని, దీనిపై ప్రజలు సరైన సమాధానం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని వీర్లపల్లి శంకర్ హెచ్చరించారు.

## ఎదులాబాద్‌లో తల్లీకూతుళ్ల అదృశ్యం

**ఘట్‌కేసర్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** భర్తతో గొడవపడి కూతురుని వెంట తీసుకొని భార్య అదృశ్యమైన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్‌కు చెందిన హనుమంతు శిరీష (35) ఈనెల 8న రాత్రి భర్త శ్రీనుతో గొడవపడింది. మరుసటి రోజు ఉదయం భర్త శ్రీను పనికి వెళ్లి తిరిగి ఇంటికి మధ్యాహ్నం 3 గంటలకు వచ్చి చూడగా ఇంట్లో భార్య, కూతురు కనిపించలేదు. ఇల్లు శుభ్రంగా పెట్టుకోవాలనే విషయమై భార్యాభర్తలు గొడవపడగా మనస్థాపం చెందిన శిరీష తన కూతురు యామిని (3)ని



వెంట తీసుకొని వెళ్లిపోయింది. భార్య కూతురు కోసం శ్రీను అంతటా వెతికినా ఆచూకి లభించకపోవడంతో ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు మహిళ, బాలిక మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని ఘట్‌కేసర్ ఎస్ఐ ఎ.శేఖర్ తెలిపారు.




మాట్లాడుతున్న కోఆర్డినేటర్ వంశీ కృష్ణ

## షాద్‌నగర్‌లో ఉత్సాహంగా సంసద్ ఖేల్ మహోత్సవ్

**షాద్‌నగర్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త :** భారతదేశ ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు, దేశవ్యాప్తంగా అన్ని పార్లమెంట్లలో, గ్రామ స్థాయి నుంచి పార్లమెంట్ స్థాయి వరకు, అన్ని పార్లమెంట్లలో సంసద్ ఖేల్ మహోత్సవ్ కార్యక్రమం నిర్వహించబడుతోంది. ఈ కార్యక్రమం పాలమూరు పార్లమెంట్ పరిధిలో, మన ఎంపీ డీకే అరుణ ఆధ్వర్యంలో పార్లమెంట్ పరిధిలో 1400 టీమ్స్, షాద్ నగర్ నియోజకవర్గంలో 160టీమ్స్ అత్యధికంగా పాల్గొన్నారు. ఇది క్రీడా ప్రోత్సాహానికి పెద్ద ఉదాహరణ అని కోఆర్డినేటర్ వంశీ కృష్ణ చెప్పారు. ఈ కార్యక్రమంలో, పార్లమెంట్ పరిధిలో, 1400 టీమ్స్, షాద్ నగర్‌లో 140 టీమ్స్ అద్భుతంగా పాల్గొన్నాయి. ఈ సందర్భంగా, అందే బాబయ్య మాట్లాడుతూ, క్రీడా స్ఫూర్తిని యువతలో పెంచాలని సదుద్దేశంతో ప్రధాని ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. యువత చాలా మంది ఈ మధ్యకాలంలో క్రీడలకు దూరంగా ఉన్న సందర్భంలో, ఈ ఆన్‌లైన్ గేమ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్స్‌కు దూరంగా ఉండి, అదే విధంగా సోషల్ మీడియాలో చెడుకి దూరంగా ఉండి, మంచిని పెంపొందే విధంగా ఉండాలి. అదే విధంగా, గెలుపోటములో సమానంగా కృషి చేసే శక్తి కేవలం క్రీడాకారులకే ఉంటుంది, కాబట్టి రెగ్యులర్‌గా క్రీడలు ఆడడం వల్ల మానసికంగా, శారీరకంగా, అన్నివిధాలుగా క్రీడలు మనిషి యొక్క నిత్యజీవితంలో ఎంత దోహదపడతాయో అన్నారు."ఈ సందర్భంగా, పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, యువత మత్తు, మద్య, గంజా వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని చెప్పారు. క్రమేపీ గ్రామాల్లో కూడా గంజా వాడకం యువతలో పెరిగిందని ఈ సందర్భంలో వారు గుర్తుచేశారు. మానసిక ఉల్లాసానికి, అదే విధంగా స్నేహభావాన్ని పెంపొందించడానికి క్రీడలు ఎంతగానో సహాయపడుతాయని, డీకే అరుణమ్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ గొప్ప క్రీడా పోటీలను విజయం సాధించాలని, గెలుపొందినవారికి గవర్నర్ చేతుల మీదుగా బహుమతి ప్రదానం కార్యక్రమం ఉంటుందని, అందరూ క్రీడా స్ఫూర్తితో ఈ కార్యక్రమంలో విజయవంతంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ వంశీ కృష్ణ సీనియర్ నాయకులు దేపల్లి అశోక్ గౌడ్, అమడాపురం నరసింహా, ఈసునాథి శ్రీనివాస్, మండల అధ్యక్షురాలు రొల్లా రాధికా,ప్యాటా అశోక్, ఎలుగనమోనిఅభిషేక్, సొప్పరి నరసింహ, కోఆర్డినేటర్లు మహేశ్, నరేంద్ర రెడ్డియుగేందర్, శివాజీ,పవన్ కుమార్ రెడ్డి, ప్రవీణా, అంజయ్య,రాము ,రాకేష్,నర్సింహ, కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు.



న్యాయం చేయాలని ఆర్డీఓను వేడుకుంటున్న రైతులు

## ఉమ్మడి భూమిని అక్రమంగా అమ్ముకుంటున్నాడు

**-రిజిస్ట్రేషన్ నిలిపివేయాలని ఆర్డీవోకి బాధితుల ఫిర్యాదు**

**దుద్యాల్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** కుటుంబం అందరి పొత్తుల భూమిని మా అన్న అక్రమంగా అమ్ముకుంటున్నాడని రిజిస్ట్రేషన్ నిలిపి వేసి న్యాయం చేయాలని మిగత ఇద్దరు తమ్ముళ్లు ఆర్డీవో అనితను వేడుకున్నారు. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దుద్యాల్ మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామానికి చెందిన ఎంట్ల మల్లయ్య, ఎంట్ల హన్మంతు, ఎంట్ల అంజిలయ్యలు ముగ్గురు అన్నదమ్ములు. మల్లయ్య కుటుంబంలో పెద్ద అన్న.. చదువుకున్న వ్యక్తి కావడంతో ఆయనపై నమ్మకంతో మిగత ఇద్దరు అన్ని వ్యవహారాలు అన్న ద్వారానే సాగించేవారు. వీరికి పెద్దల ద్వారా పొందిన భూమిలో హన్మంతు. అంజిలయ్యలతో పాటు వారి భార్యలు రాత్రింభవళ్లు వ్యవసాయం చేసుకుంటు లాభాలు అన్ని అన్నకు అందించేవారు. అలా వ్యవసాయంతో వచ్చిన డబ్బుతో పెద్దల భూమికి తోడుగా మరికొంత భూమిని కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన భూమిని అన్న మల్లయ్యపై రిజిస్ట్రేషన్ చేపించారు. కొన్ని సంవత్సరాలు వ్యవహారాలు సాఫిగా సాగాయి. ఇటీవలే ఎంట్ల మల్లయ్య అనే వ్యక్తి అన్నదమ్ముల ఉమ్మడి (తన పేరుపై ఉన్న) భూమిని తన తమ్ముళ్లైన ఎంట్ల హన్మంతు. ఎంట్ల అంజిలయ్యకు తెలియకుండా గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి అమ్మాలని నిచ్చయించుకున్నాడు. సదురు కొనుగోలుదారుడి దగ్గర నుండి కొంత డబ్బును సైతం పుచ్చుకున్నట్లు సమాచారం. ఇదే విషయం తమ్ముళ్ళకు తెలియడంతో అన్నను నిలదీశారు. దీంతో మల్లప్ప భూమి నాది అని, నేను కొనుగోలు చేశానని తమ్ముళ్లకు తెలియకుండా రెండు రోజుల క్రితం కొడంగల్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న మల్లయ్య తమ్ముళ్లు, వారి భార్యలు అధికారులను, తన అన్నని న్యాయం చేయాలని కాళ్ల వేళ్ల పడి వేడుకున్నారు. మల్లయ్య పోలీసులు సహయంతో తమ్ముళ్లను బయటకు వెళ్లగొట్టారు. ఎవ్వరు న్యాయం చేస్తారో తెలియక న్యాయం జరుగకుంటే ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. కానీ గ్రామస్తులు వారికి నచ్చజెప్పున్నారు. దీంతో చేసేదేమి లేక ఆర్డీవో అనితను కలిసి వారి గోడును వెళ్లబుచ్చుకున్నారు. వెంటనే స్పందించి ఆ భూమికి సంబందించి రిజిస్ట్రేషన్ నిలిపివేయాలని దుద్యాల్. కొడంగల్ తహసీల్దార్లకు సూచించారు. న్యాయం జరగకుంటే మాకు అత్మహత్యనే దిక్కు అంటు బాధితులు హన్మంతు. అంజిలయ్యలు ఆర్డీవో ముందు కన్నీటి పర్యంతం అయ్యారు.



ఉచిత వైద్య శిబిరాలు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ తదితరులు

## హెల్త్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోండి

**షాద్‌నగర్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త :** షాద్ నగర్ మున్సిపాలిటీ లో 8 వార్డు ఆర్టీసీ కాలనీలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చించోడు ఆధ్వర్యంలో, ఎం.ఎల్.హెచ్.పి వైద్యాధికారి డాక్టర్ సాదిక్ అహ్మద్ ఫ్రీ హెల్త్ క్యాంపు నిర్వహించారు . మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్ మాట్లాడుతూ మన తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ మెడికల్ క్యాంపును ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని, ఇక్కడ అందరికీ బిపి పరీక్షలు, షుగర్ పరీక్షలు ఫ్రీగా చేసి, వచ్చిన వారందరికీ కావలసిన యొక్క మందులు ఫ్రీ అందిస్తారని తెలియజేశారు. హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాస్,వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, కౌన్సిలర్లు పెంటయ్య , బచ్చలి నరేష్ సంతోషి బాయి, మురళీమోహన్(అప్పి), డాక్టర్ సాదిక్ అహ్మద్ , జె.శ్రీనివాసులు హెల్త్ ఎడ్యుకేటర్, ఏఎన్ఎం రమాదేవి, కవిత, శ్వాతమ్మ, కత్తి చంద్రశేఖర అప్ప తంగళ్ళపల్లి శంకర్ ,సయ్యద్ ఖదీర్,రమేష్, కౌన్సిలర్లు సుదీర్ , ఎస్పీ శివ మరియు ఆశలు, తదితరులు పాల్గొన్నారు. శ్రీనగర్ కాలనీలో ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూరి బస్వం, వైస్ చైర్మన్ అందే మోహన్, కౌన్సిలర్లు మురళీమోహన్ (అప్పి), పెంటయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, నాయకులు తంగెళ్లపల్లి శంకర్, చౌలపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, కే శ్రీనివాసరెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాస్, డా. సత్యనారాయణ, ఏఎన్ఎంలులు, ఆశా వర్కర్లు ఉషా, పి. మంజుల, పుష్పలీల, విజయ, శ్రీదేవి, షకీలా బేగం, విజయలక్ష్మి ్మ, జ్యోతి, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

## రౌడీషీటర్లకు డ్రగ్ పరీక్షలు

**హైదరాబాద్,ఏప్రిల్ 10, ప్రభాతవార్త**

హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో రౌడీ షీటర్లపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. నగరంలో పలు చోట్ల రౌడీల ఆగడాలు మితిమీరిపోతున్నారు. ఈ నేపథ్యంలో నగర పోలీస్ కమిషనర్ విసి సజ్జనార్ ఆదేశాలతో రంగంలోకి దిగిన పోలీసులు రౌడీ షీటర్లకు డ్రగ్ టెస్టులు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్‌లో ప్రస్తుతం 1300 మందికి పైగా రౌడీ షీటర్లు ఉండగా 239 మందికి పైగా డ్రగ్ టెస్టులను నిర్వహించారు. ఇందులో 189 మందికి గంజాయి పాజిటివ్,మిగిలిన 50 మందికి నెగటివ్ వచ్చినట్లు పోలీసులు నిర్ధారించారు.వీరంతా గంజాయికి అలవాటు పడినట్లు పోలీసులు గుర్తించారు. గంజాయి ఎక్కడ నుంచి వస్తుందంటూ వారిని పోలీసులు విచారిస్తున్నారు. గాంధీ ఆసుపత్రిలో 70 మందికి పరీక్షలు నిర్వహించగా 44 మందికి పాజిటివ్, 26 మందికి నెగెటివ్ వచ్చింది. అలాగే ఉస్మానియా ఆసుపత్రిలో 80 మందికి పరీక్షలు చేయగా 59 మందికి పాజిటివ్, 21 మందికి నెగెటివ్, ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రిలో 89 మందికి పరీక్షలు చేయగా 86 మందికి పాజిటివ్, ముగ్గురికి నెగెటివ్ వచ్చింది.ఎర్రగడ్డ మానసిక చికిత్సాలయంలో పరీక్షించిన వారిలో అత్యధికంగా పాజిటివ్ కేసులు నమోదయినట్లు పోలీసులు గుర్తించారు.

డ్రగ్ టెస్టులో పాజిటివ్ వచ్చిన వారిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ పరీక్షల అనంతరం వారికి వైద్యులు, మానసిక నిపుణులతో కౌన్సెలింగ్ నిర్వహించారు. డ్రగ్స్ వినియోగించే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని నగర పోలీసులు ఈ సందర్భంగా హెచ్చరించారు. మరోవైపు పాతబస్తీ రాజేంద్రనగర్ జోన్ చంద్రాయణగుట్టలో గురువారం అర్ధరాత్రి పలువురు రౌడీషీటర్లకు డ్రగ్స్ టెస్టులను పోలీసులు నిర్వహించారు. ఈ సందర్భంగా రౌడీ షీటర్లు మతీన్ జబ్రీ, హాశంలతోపాటు రెహాన్, వజహ త్ అలీలకు నిర్వహించిన టెస్టులో పాజిటివ్ వచ్చింది. దాంతో వారిని చం ద్రాయణగట్ట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం జ్యుడిషియల్ అధికారుల ఎదుట వారిని పోలీసులు హాజరుపరిచారు.




## దోమల నివారణపై అవగాహన ర్యాలీ

**దమ్మాయిగూడ, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ ఆదేశానుసారం, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఎంటమాలజీ, శానిటేషన్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో దోమల నివారణపై శనివారం విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దమ్మాయిగూడ ఎక్స్ రోడ్ నుండి పి.ఎస్. రావు నగర్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించి ప్రజల్లో చైతన్యం నింపారు. అనంతరం అధికారులు, సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమల వృద్ధిని అరికట్టడం ద్వారానే సీజనల్ వ్యాధులను నివారించగలమని అధికారులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ విభాగానికి చెందిన డీఈ సంతోష్, ఏఈలు అనిల్, భాస్కర్ తిరుపతి రాజు, శ్రీనివాస్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ దుర్గా పాల్గొన్నారు.



## కడ్తాల్‌లో అంబలి కేంద్రానికి విశేష స్పందన

**కడ్తాల్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** మండుతున్న ఎండల దృష్ట్యా సామాన్య ప్రజల దాహార్తిని తీర్చడానికి లయన్స్ క్లబ్ ఆమనగల్ ఆధ్వర్యంలో కడ్తాల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అంబలి కేంద్రానికి అపూర్వ ఆదరణ లభిస్తోంది. గత పది రోజులుగా నిర్విరామంగా కొనసాగుతున్న ఈ కేంద్రాన్ని క్లబ్ అధ్యక్షులు కె. గోవర్ధన్ రెడ్డి శుక్రవారం పర్యవేక్షి ంచారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతల వల్ల ప్రయాణికులు, కార్మికులు వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు ఈ చల్లటి రాగి అంబలిని పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రతిరోజూ సుమారు 250 మందికి పైగా ప్రజలు ఈ కేంద్రాన్ని సందర్శించి అంబలిని సేవిస్తున్నారని వివరించారు. పది రోజులుగా క్లబ్ సభ్యులు సమన్వయంతో ఈ కేంద్రాన్ని విజయవంతంగా నడుపుతున్నారని అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు లయన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ వాణి

## ప్రగతి ప్రణాళిక ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం

**ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రజల నుండి అందే పిర్యాదులను తక్షణమే పరిష్కరిస్తామని ఘట్‌కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వాణి అన్నారు. పోచారం డివిజన్ చౌదరిగూడ వెంకటాద్రీ టౌన్‌షిప్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ పాల్గొని స్థానికులతో సమావేశమై సమస్యలపై వినతులు స్వీకరించారు. కాలనీలో పరిశుభ్రత కోసం కాలనీవాసులు సిబ్బందికి సహకరించాలని కోరారు. కాలనీలు, రోడ్లు పరిశుభ్రంగా ఉండేందుకు తమ ఇండ్ల నుండి వెలువడే చెత్తను చెత్తబండిలోనే వేయాలని సూచించారు. రోడ్లు, వీధి లైట్లు ఏర్పాటు, పచ్చదనంతో పాటు పరిశుభ్రంగా ఉండే విధంగా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు సకాలంలో ఆస్తిపన్ను చెల్లించాలని కోరారు. ఈ సందర్భంగా కాలనీవాసులు తమ సమస్యలను పరిష్కరించాలని డీసీకి వినతి పత్రాలు అందజేశారు.



బోరు వేయిస్తున్న బిఆర్ఎస్ నాయకులు

## ఇంద్రానగరలో తాగునీటి సమస్య పరిష్కారం

**జిల్లెడు చౌదరిగూడ, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** జిల్లేడు చౌదరిగూడ మండలం ఇంద్రానగర్ గ్రామంలో నెలకొన్న తీవ్ర త్రాగునీటి సమస్యను మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పరిష్కరించారు. గ్రామంలో నీటి ఎద్దడి ఉందని గ్రామస్థులు ఆయన దృష్టికి తీసుకురాగానే, వెంటనే స్పందించి నూతన బోరు వేయించారు. అధికారం ఉన్నా లేకపోయినా ప్రజల సమస్యల పరిష్కారమే ఆయన ధ్యేయమని ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు అభినందిస్తున్నారు. తమ నీటి కష్టాలను తీర్చినందుకు గ్రామస్థులు అంజయ్యయాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సయ్యద్ హఫీజ్ తదితరులు పాల్గొని బోరు పనులను పర్యవేక్షించారు.



మందులు పంపిణీ చేస్తున్న చైర్మన్

## ప్రజారోగ్యంపై అవగాహన పెంపొందించాలి

**ఆమనగల్లు, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** ప్రజారోగ్య పరిరక్షణ పట్ల సమాజంలో అవగాహన పెంపొందించవలసిన అవసరం ఉందని పురపాలక సంఘ చైర్మన్ నేనావత్ పత్యానాయక్ అన్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో స్థానిక 6వార్డులో శుక్రవారం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పురపాలక చైర్మన్ పత్యానాయక్ ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం వైద్యులు ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ వ్యాధుల పట్ల నిర్లక్ష్యం చేయవద్దని కోరారు. ఎప్పటికప్పుడు వైద్యుల సూచలనలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది తిరుపతిరెడ్డి, కాలనీవాసులు మాజీ వార్డు సభ్యులు పూసలి సత్యం, వరికుప్పల గణేశ్, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది, కొండల్‌రెడ్డి, లాలయ్య, పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మెహిదీపట్నంలో స్కైవాక్ నిర్మాణ పనులు..ట్రాఫిక్ మళ్లింపు

**కార్వాన్, ఏప్రిల్ 10,ప్రభాతవార్త :** మెహిదీపట్నం రైతుబజార్ బస్ స్టాప్ వద్ద స్కైవాక్ నిర్మాణ పనుల దృష్ట్యా మాసబ్ ట్యాంక్, ఎన్.ఎం.డి.సి, సరోజిని ఐ హాస్పిటల్ వైపు నుండి మెహిదీపట్నం రైతుబజార్,రేతి బౌలి,నానల్ నగర్ వైపు వెళ్లే వాహనాలను పి.వి.ఎన్.ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే పిల్లర్ నెం.2,3 అజీజియా మసీదు వద్దమళ్లిస్తూ మెరాజ్ కేఫ్ వద్ద కుడి వైపుకు తిరిగి,మెహిదీపట్నం పిల్లర్ నెం.15వద్ద తిరిగి ప్రధాన మార్గంలోకి చేరుకోవాల్సి ఉంటుందని,ప్రజలు సహకరించాలని హైదరాబాద్ నగర ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ డి.జోయల్ డేవిస్ ఐపీఎస్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

# మహిళా భద్రత కోసం షి నేత్ర టీమ్స్: సిపి సజ్జనార్

**హైదరాబాద్,ఏప్రిల్ 10, ప్రభాతవార్త :** మహిళల ఆత్మగౌరవానికి, వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించే రహస్య కెమెరాల గుట్టు రట్టు చేసేందుకు హైదరాబాద్ పోలీసు విభాగం సరికొత్త అస్త్రాన్ని సిద్ధం చేసింది. హోటళ్లు, మాల్స్, హాస్టళ్లు, విద్యాసంస్థలతో పాటు వ్యాపార, వాణిజ్య సముదాయాల్లో నిఘా కెమెరాల ముప్పు నుంచి రక్షణ కల్పించేందుకు షీ నేత్ర టీమ్స్‌ను ఏర్పాటు చేసింది. నగర కమిషనరేట్ పరిధి లోని ఏడు జోన్లకు ఒక్కో బృందం చొప్పున మొత్తం ఏడు షీ నేత్ర ప్రత్యేక టీమ్‌లను రంగంలోకి దింపింది. ఈ బృందాలకు అత్యాధునిక కెమెరా డిటెక్టర్ల వినియోగం, తనిఖీల సమయంలో పాటించాల్సిన నిబంధనల ఎస్‌వోపీపై రెండు దశల్లో పూర్తిస్థాయి శిక్షణ ఇచ్చారు. బషీర్‌బాగ్‌లోని పాత కమిషనరేట్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో సీపీ సజ్జనార్ ఈ ప్రత్యేక బృందాలకు కెమెరా డిటెక్టర్ పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షాపింగ్ మాల్స్‌లోని ట్రయల్ రూమ్‌లు, ఆస్పత్రులు, హోటళ్లు, హాస్టళ్లల్లో రహస్యంగా కెమెరాలు అమర్చి మహిళల గోప్యతకు భంగం కలిగించే ఘటనలపై ఉక్కుపాతం మోపు తామన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి ఈ ఏడు బృందాల ద్వారా నగర వ్యాప్తంగా ముమ్మరంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. తమ ప్రాంగణాల్లోని ప్రైవేటు ప్రదేశాల్లో రహస్య కెమోరాలు లేవని నిర్ధారిం చుకోవాల్సిన పూర్తి బాధ్యత ఆయా యాజమాన్యాలదేనని స్పష్టం చేశారు. నిబంధలు అతిక్రమిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని, అజా గ్రత్తగా ఉన్న లేదా కెమెరాలు లభ్యమైనా సంబంధిత యాజమాన్యాలపై అత్యంత కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే ఆయా సంస్థలను బాధ్యులైన ఉద్యోగులను బ్లాక్‌లిస్టులో చేసేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ప్రతి సంస్థ తప్పనిసరిగా కస్టమర్ సేఫ్టీ అనే చార్జీని నియమించుకోవాలని, వీరు షీ టీమ్స్‌కు నోడల్ ఏజెన్సీగా వ్యవ హరించాలని సూచించారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

## మండుటెండలో చల్లని ఊరట

**షాద్‌నగర్‌లో జోరుగా మజ్జిగ పంపిణీ**

**షాద్‌నగర్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త :** వేసవి భానుడి భగభగలకు అల్లాడిపోతున్న బాటసారులకు షాద్‌నగర్ పట్టణంలో చల్లని ఊరట లభించింది. సామాజిక బాధ్యతతో చేపట్టిన మజ్జిగ పంపిణీ కార్యక్రమం స్థానికుల ప్రశంసలు అందుకుంటోంది.

**సేవా దృక్పథంతో ముందుకు..**

పరిగి రోడ్డులోని పోచమ్మ గుడి సమీపంలో బిజెపి నాయకులు శ్రీనివాస్ చారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి దాత ఆగిరు శ్రీనివాస్ ఆర్థిక సహకారం అందించారు. మండుతున్న ఎండలో ప్రయాణిస్తున్న బాటసారులకు, కార్మికులకు ఇది చాలా ఉపయోగపడుతుంది.

**ముఖ్య అతిథుల సందేశం**

ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. సమాజంలో ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం నిజంగా ప్రశంసనీయమని కొనియాడారు. కేవలం రాజకీయాలే కాకుండా, ప్రజా సేవలోనూ తాము ముందుంటామని ఈ కార్యక్రమం ద్వారా చాటిచెప్పారు.

"దాతృత్వం అనేది మనిషికి ఉండాల్సిన గొప్ప గుణం. ఎండ తీవ్రత దృష్ట్యా ఆగిరు శ్రీనివాస్ చేసిన ఈ మజ్జిగదానం ఎంతోమందికి ఉపశమనాన్ని కలిగిస్తోంది."

**పాల్గొన్న ప్రముఖులు**

ఈ సేవా కార్యక్రమంలో బిజెపి నాయకులు మఠం రిషికేశ్ సామాజిక కార్యకర్త నీల రవీందర్‌లతో పాటు హరీష్, శివకుమార్, సుధాకర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**తలకొండపల్లి, ఏప్రిల్ 10 ,ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల కేంద్రంలో శుక్రవారం నాడు కళ్యాణ లక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పంపిణీ చేశారు. తలకొండపల్లి మండల కేంద్రంలోని దేవకీ గార్డెన్లో స్థానిక తహసిల్దార్ రమేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదప్రజలకు ఎన్ని కల్లో ఇచ్చిన హామీ మేరకు అన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని మొత్తం 84మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండో చైర్మన్ గట్ల కేశవరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ యాట గీత నరసింహ, వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, సర్పంచులు కాసు శ్రీనివాస్ రెడ్డి, శేఖర్ యాదవ్, గుజ్జుల లక్ష్మమ్మ, ఇమ్మడి మహేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అంజయ్య వెంకట్ రెడ్డి నాయకులు రేణు రెడ్డి , డిప్యూటీ తాసిల్దార్ సంతోష్‌తో పాటు ఆయా గ్రామాల జిపిఓలు తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

**తలకొండపల్లి ఏప్రిల్ 10 ,ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని పెద్దూర్ తండాకు చెందిన మూడవ శంకర్ మృతి చెందాడు. గత కొంతకాలంగా అనారోగ్యానికి గురైన శంకర్ అకస్మాత్తుగా మృతి చెందడం పట్ల పెద్దూర్ తండా మాజీ ఎంపిటిసి అమరావతి రఘునాయక్ శుక్రవారం నాడు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. శంకర్ లేని లోటు కుటుంబానికి తీర్చలేనిదని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. అనంతరం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ నుంచి 3000 రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి రఘునాయక్, ఉప సర్పంచ్ భాస్కర్ నాయకులు శోభ శీను భాష గోగ్లే తదితరులున్నారు.

## ఇంటి నిర్మాణానికి సిమెంట్ పంపిణీ

**తలకొండపల్లి ఏప్రిల్ 10, ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల పరిధిలోని జూలపల్లి గ్రామానికి చెందిన బైండ్ల దేవేందర్ అనే యువకునికి ఉప్పల చారిటబుల్ ట్రస్టు ద్వారా ఇంటి నిర్మాణానికి కావలసిన సిమెంటును అందజేశారు. శుక్రవారంనాడు మాజీ సర్పంచ్ విజయ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఉప్పల ట్రస్ట్ నుంచి లబ్ధిదారునికి సీకులు ,సిమెంటు అందజేశారు. ఈ సందర్భంగా విజయకుమార్ రెడ్డి మాట్లాడుతూ నిరుపేదలను ఆదుకునేందుకు ఉప్పల ట్రస్ట్ ఎంతో ఉపయోగపడుతుందని, పేదవారు ఇల్లు కట్టుకునేందుకు వెంకటేష్ ఆదుకోవడం అభినందనీయమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జూలపల్లి మాజీ సర్పంచ్ విజయ్ కుమార్ రెడ్డి, బి ఆర్ఎస్ నాయకులు గోవర్ధన్ గౌడ్ అశోక్ శివ నాగయ్య రాఘవేందర్ తదితరులున్నారు

## డిజిపిని కలిసిన సత్తు వెంకటరమణారెడ్డి

**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:**




తెలంగాణ రాష్ట్ర డిజిపి బత్తుల శివధర్‌రెడ్డిని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకట రమణారెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సిపిఎం జిల్లా నాయకులు బోడ సామేల్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని డిజిపి కార్యాలయంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఈ సందర్భంగా సత్తు వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ తీసుకుంటున్న చర్యలు అభినందనీయమన్నారు. నియోజకవర్గ పరిధిలోని పలు సామాజిక అంశాలపై డీజీపీతో చర్చించినట్లు ఆయన పేర్కొన్నారు. డిజిపిని కలిసినవారిలో తులేకలాన్ సర్పంచ్ సామ అశ్వినీ రవీందర్ రెడ్డి, కౌన్సిలర్ బుగ్గరాములు, ఉప సర్పంచ్ జగదీష్, మాజీ సర్పంచులు రవీందర్, యాదగిరి, బీరప్ప, రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.

## ఉత్తమ ఫీల్డ్ అసిస్టెంట్‌గా యాచారం అనిత

**యాచారం,ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో ఉతమ సేవలు అందించిన యాచారం అనితను జిల్లా ఎంఎన్ఆర్ఇజిఎస్ అధికారులు డిఆర్డీ ఎ పిడి అనురాధ శుక్రవారం ఘనంగా సన్మానించారు. యాచారం మండల పరిధిలోని తాడిపర్తి గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ యాచారం అనిత ఉపాధి హామీ పనులను నిర్వర్తించడంలో కూలీలకు ఉపాధి కల్పించిన సందర్భంగా సేవలను గుర్తించి జిల్లా అధికారులు ఉత్తమ ఫీల్డ్ అసిస్టెంట్గా గుర్తించారు. తన సేవలను గుర్తించిన ఉన్నతాధికారులకు ఫీల్డ్ అసిస్టెంట్ అనిత కృతజ్ఞతలు తెలిపారు.



కార్యక్రమంలో పిడి అనురాధ, ఎంపీడీవో రాందారాన్ని, ఫీల్డ్ అసిస్టెంట్ అనిత

## ఆయిల్ ఫామ్ సాగుతో రైతుకు లాభాలు

**ఉద్యానవన శాఖ అధికారి సురేష్**

**కేశంపేట, ఏప్రిల్ 10, ప్రభాతవార్త :** ఆయిల్ ఫామ్ సాగుతో రైతులకు మంచి లాభాలు వస్తాయని ఆయిల్ పంప్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సురేష్ తెలిపారు. శుక్రవారం కేశంపేట మండలం లింగం ధన గ్రామంలో ఆయిల్ ఫామ్ సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు ఎద్మ నర్సింహారెడ్డి వ్యవసాయ క్షేత్రంలో రైతులకు ఫామ్ ఆయిల్ తోటను చూపించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో లింగం ధన సర్పంచ్ నాగిళ్ల వెంకట్, వ్యాల్యూ ఆయిల్ ఫామ్ ఉపాధ్యక్షులు రామ్మోహన్ రావు, ఉపసర్పంచ్ లావణ్య తిరుపతిరెడ్డి, ఏఈఓ సమీనా, రైతులు రైతులు మధుసూదన్ గౌడ్, బండెల రాజేందర్ రెడ్డి,మోహన్ రెడ్డి, నారాయణ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, రాంరెడ్డి, రఘుపతి రెడ్డి భూపాల్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, రామిరెడ్డి, గోపాల్ గౌడ్, యాదగిరి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## వీర హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు

**..గత నలబై ఏళ్లుగా ప్రజాప్రతినిధిగా, కాంగ్రెస్‌లో రాజకీయ యోధునిగా రాణించిన పీసరి శ్రీనివాస్‌రెడ్డికి అభినందనల వెల్లువ**

**శామీర్‌పేట, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:**

దేవరయాంజాల్‌లోని శ్రీవీరహనుమాన్ ఆలయంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ మాజీ ఉపాధ్యక్షులు పీసరి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. శుక్రవారం శామీర్‌పేట మండలం దేవరయాంజాల్‌లోని శ్రీవీరహనుమాన్ దేవాలయంలో పీసరి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవరయాంజాల్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచు, అల్వాల్ సొసైటీ మాజీ చైర్మన్, 30ఏళ్ల కిందట శామీర్‌పేట మండల కాంగ్రెస్ తొలి అధ్యక్షులుగా. గతంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులుగా పనిచేసిన పీసరి శ్రీనివాస్‌రెడ్డిని పలువురు అభినందించారు.

కాంగ్రెస్ పార్టీకి, ప్రజలకు ప్రజాప్రతినిధిగా పలు పదవులు నిర్వహించి నిస్వార్ధంగా సేవలు అందించి ప్రజల్లో పార్టీలో 40ఏళ్లకు పైగా రాజకీయ యోదునిగా కొనసాగిన పీసరి శ్రీనివాస్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని శ్రీవీరహనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆ తరువాత ఆయనకు పలువురు నాయకులు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేసి సన్మానించి అభినందనలు తెలియజేశారు.

ఈ సందర్భంగ జిల్లా ఆర్టీఎ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, దేవరయాంజాల్ మాజీ సర్పంచు ఇ.శ్రీనివాస్‌గోల్డ్, రామాలయం మాజీ ధర్మకర్తలు పి.నర్సింహ్మారెడ్డి, ఎన్.హరిగోపాల్, జి.హరికృష్ణ, మాజీ వార్డుసబ్యులు ఎం.శ్యామ్ కుమార్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఎస్.దుర్గయ్య, ఆర్.శ్రీని వాస్‌యాదవ్, కె.శ్రీకాంత్‌రెడ్డిలు సన్మానించి అభినందనలు తెలియజేశారు.



దేవరయాంజాల్‌లోని శ్రీవీర హనుమాన్ దేవాలయంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ మాజీ ఉపాధ్యక్షులు పీసరి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఆర్టీఎ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, మాజీ సర్పంచు ఇ.శ్రీనివాస్, తదితరుల దృశ్యం

## అలియాబాద్ మున్సిపల్ కార్యాలయం వద్ద ఉచిత మెగా వైద్యశిబిరం

**..ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్ కంఠం శిరీషకృష్ణారెడ్డి**

**శామీర్‌పేట, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** అలియాబాద్ మున్సిపల్ కార్యాలయం వద్ద ఉచిత మెగా వైద్య శిబిరం జరిగింది. శుక్రవారం శామీర్‌పేట మండలం అలియాబాద్ మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఉచిత వైద్య మెగా శిబిరంను మున్సిపల్ చైర్‌పర్సన్ కంఠం శిరీషకృష్ణారెడ్డి ప్రారంభించారు. మెడిసిటీ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య మెగా శిబిరం జరిగింది. దీనిలో బీపి, షుగర్, కంటి పరీక్షలు, చెవి,ముక్కు, గొంతు, వరిబీజం, బీజకుట్టు, గడ్డలు, కనతలు, థైరాయిడ్, గర్బసంచి సమస్యలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, చర్మ సమస్యలు, మోకాళ్ల నొప్పులు, నడుము నొప్పులు, ఊపిరితిత్తుల సమస్యలను వైద్యులు చూసి మందులు రాసిన వారికి అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి రోగులకు మందులను ఉచితంగ పంపిణీ చేశారు. ఈ శిబిరంలో 110మందికి బిపి,షుగర్, టెస్టులు చేశామని, ఆపరేషన్, పరీక్షలు వంటి అవసరం ఉన్న వారికి 32మందిని గుర్తించి మెడిసిటీ హాస్పిటల్‌కు రెఫర్ చేసినట్లు ఉచితంగ ఆపరేషన్లు చేయటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ చంద్రశేఖర్, డాక్టర్లు షిర్వా, శితల్, షిఫ, షార్వాణి, మహాలక్ష్మి, మార్కెటింగ్ టీమ్ లీడర్ సత్యనారాయణ, రాజు,రాఘవేంద్ర, బాలకృష్ణ, శంకర్, సంజన, పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన ఉచిత మెగా వైద్య శిబిరంను ప్రారంభించి వైద్యులతో పరీక్షలు చేయించుకుంటున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి,పాల్గొన్న కమిషనర్, తదితరుల దృశ్యం

# ప్రైవేటు కంటే ప్రభుత్వ పాఠశాల ముద్దు

**ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు..**

**మొయినాబాద్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త :** ప్రైవేటు పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలు మెరుగైనవని, విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని మొయినాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సోనియా దర్శన్ సూచించారు. గురువారం మొయినాబాద్ మండల పరిధిలోని ముర్తుజగూడ గ్రామంలోని అప్పర్ ప్రైమరీ పాఠశాలలో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సోనియా దర్శన్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని నాణ్యమైన విద్యతో పాటు పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం వంటి అనేక సౌకర్యాలను అందిస్తున్నదని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు కూడా ప్రైవేటు పాఠశాలల విద్యార్థులతో సమానంగా ప్రతిభ కనబరుస్తున్నారని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా మండల విద్యాధికారి మల్లయ్య మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని గురువుల మార్గదర్శకత్వంలో ముందుకు సాగాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందించేలా బోధన చేయాలని అన్నారు.కార్యక్రమంలో విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు, నృత్యాలు, పాటలతో అతిథులను ఆకట్టుకున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## వేసవికాలంలో వైద్యుల సలహాలు పాటించాలి: డాక్టర్ ఇందిరా

**యాచారం, ఏప్రిల్10, ప్రభాతవార్త:** వేసవికాలంలో వైద్య అధికారులు ఇచ్చే సలహాలు పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆయుర్వేదిక్ వైద్య అధికారి ఇందిరా తెలిపారు. శుక్రవారం యాచారం మండల పరిధిలోని అయ్యవారిగూడ గ్రామంలో డాక్టర్ ఇందిరా ఆధ్వర్యంలో ఆయుర్వేదిక ఉచిత వైద్య శిబిరాన్ని సర్పంచ్ నక్క అలివేలు వెంకటేష్, ఉప సర్పంచ్ కిషన్ నాయక్,వార్డు సభ్యులతో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా కలిసి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఇందిరా మాట్లాడుతూ.. వేసవికాలంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని లేదంటే అనారోగ్య బారిన పడి ఇబ్బందులకు గురవుతారని సూచన చేశారు. ఎండ తీవ్రత ఉన్నప్పుడు బయటకు వెళ్లరాదని ఉదయాన్నే బయటి పనులు నిర్వర్తించుకోవాలని కోరారు.ఆయుర్వేదిక్ వైద్యం అతి పురాతనమైనదని సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా దీర్ఘకాలిక రోగాలు కూడా తగ్గుతాయని తెలిపారు. ఆరోగ్యవైద్య శిబిరంలో గ్రామంలోని వృద్ధులు యువకులు మహిళలు ఎంతోమంది వైద్య సేవలు పొందారని అన్నారు.




అయ్యవారిగూడెం ఉచిత వైద్య శిబిరంలో సర్పంచ్ ఉప సర్పంచ్ డాక్టర్

## యోగతో సంపూర్ణ ఆరోగ్యం

**కేశంపేట, ఏప్రిల్ 10, ప్రభాతవార్త :** యోగా చేయడంతో సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ధైర్యం, ఒత్తిడి నుండి సురక్షితంగా ఉంటుందని ఎంపీడీవో రవిచంద్ర కుమార్ రెడ్డి అన్నారు. ప్రజా పాలన ప్రగతిప్రాణాలిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కేశంపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో యోగా, మెడిటేషన్ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ బొజ్జం సంతోష్ శ్రీశైలం యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యోగా, ధ్యానము, ప్రతి ఒక్కరూ అలవలుచుకోవాలని యోగ, మెడిటేషన్ చేయడం ద్వారా ఎంత పెద్ద అనారోగ్య సమస్యలు ఉన్న వాటిని నిర్మూలించుకోవచ్చని జీవితంలో ప్రతి మనిషి సంపూర్ణంగా ఆరోగ్యంగా జీవించాలంటే అది కేవలం మెడిటేషన్, యోగ ద్వారా నే సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ ఈఅలవాట్లను అలవాటు చేసుకోవాలని ఎంపీడీవో రవిచంద్ర కుమార్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వైద్య అధికారిని నికిత మాట్లాడుతూ యోగ పుట్టిన భారత దేశంలో మనందరం కూడా పుట్టడం అనేది ఒక గొప్ప అదృష్టంగా భావించాలని ప్రతి ఒక్కరూ యోగ ప్రక్రియ ద్వారా శరీరాన్ని మనసును శుద్ధి చేసుకుని మానసిక ఒత్తిడిని దూరం చేసుకోవాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో యోగా మాస్టర్ శ్రీ శ్రవణ్, ఎంపీఓ కిష్టయ్య ఐసిడిఎస్ సూపర్వైజర్ శ్రీమతి దివ్య సింగ్, సమంతకమని, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది మండల పరిధిలోని గ్రామ పంచాయతీల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



యోగా డే కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

## ముదిరాజ్ ఉద్యమాన్ని అణిచివేయలేరు

**- కొత్తూరు నాయకుల ఆగ్రహం**

**కొత్తూరు, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** హలో ముదిరాజ్ చలో గాంధీ భవన్ ముట్టడి సందర్భంగా కొత్తూరు మండలంలోని ముదిరాజ్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ నాయకులు మాట్లాడుతూ, తెలంగాణలో ముదిరాజ్ సామాజిక వర్గ హక్కుల సాధన కోసం చేపట్టిన పోరాటాన్ని అక్రమ అరెస్టులతో అడ్డుకోలేమని కొత్తూరు మండల ముదిరాజ్ నాయకులు స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటినా, ముదిరాజ్ వర్గానికి ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని వారు తీవ్రంగా విమర్శించారు.హల్లో ముదిరాజ్ – ఛలో గాంధీ భవన్ ముట్టడి కార్యక్రమాన్ని అడ్డుకోవడానికి చేసిన అక్రమ అరెస్టులు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు. అయినప్పటికీ, ముదిరాజ్ హక్కుల కోసం పోరాటం మరింత ఉత్సాహంతో కొనసాగుతుందని హెచ్చరించారు. అరెస్ట్ అయిన వారిలో మాసులు అంజయ్య, గొడుగు రవి, గొడుగు శ్రీను, గుండు సురేష్ ముదిరాజ్ తదితరులను అరెస్ట్ చేసినట్లు నాయకులు తెలిపారు.




ముందస్తు అరెస్టు అయిన ముదిరాజ్ సంఘం నాయకులు

## గుర్తు తెలియని మహిళా మృతదేహం లభ్యం

**మేడ్చల్, ఏప్రిల్ 10. ప్రభాతవార్త :** గుర్తు తెలియని ఓ మహిళా మృతదేహాన్ని మేడ్చల్ పోలీసులు కనుగొన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని డబిల్‌పూర్ రైల్వేస్టేషన్ సమీపంలో మహిళా మృతదేహం ఉన్న విషయాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు పరిశీలించారు. సుమారు 40 నుండి 45 సంవత్సరాల వయస్సు గల మహిళ మృతి చెంది ఉన్నట్లు గుర్తించారు. ఆమె వివరాల తెలియకపోవడంతో గుర్తు తెలియని మహిళా మృతదేహంగా నిర్ధారించారు. మృతురాలు పింక్, ఆరంజ్ చీర, బ్లౌజ్ దరించి ఉన్నదని తెలిపారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## గోమాతకు జాతీయ ప్రాణి హోదా కల్పించాలి

**కొడంగల్,ఏప్రిల్ 10,ప్రభాతవార్త :** భారతీయ సంస్కృతి సంప్రదాయాల్లో భాగంగా హిందువులు పవిత్రంగా పూజించే గోమాత చయొక్క సంరక్షణ,గోమాతకు జాతీయ ప్రాణి హోదా కల్పించాలని గో సేవలకు రాజు మరాఠా,అరుణ్ సిరిగిరి, మహేష్,నిఖిల్,శ్రీకాంత్‌రెడ్డి,అభిజిత్,శేఖర్,కడంపల్లి మహేష్‌లు డిమాండ్ చేశారు.ఈ మేరకు వారు శుక్రవారం కొడంగల్‌లో కరపత్రాలను విడుదల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోమాతకు జాతీయ ప్రాణి హోదా కల్పించాలని భారతదేశం అంతట జరుగుతున్న గోమాత ఆరాధన ఉద్యమ సంతకాల సేకరణలో ప్రజలు భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు.భారతదేశంలో సంపూర్ణ గోహత్య నివారణలో గల ప్రతిబంధకాలు,గోహత్యను రూపుమాపుట,గోవుని దేశ మాతగా ఆరాధ్యనీయ దేశదేవతగా,దేశ ఔన్నత్యానికి చిహ్నంగా గౌరవించాలని,గోసేవ కొరకు మంత్రిత్వశాఖ ఏర్పాటు,గో పరిరక్షణ బోర్డును ఏర్పాటు చేసి గోఆధారిత పంచగవ్య ఉత్పాదనలు జరగాలని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు విన్నవిస్తూ కొడంగల్ మండలంలోని అన్ని గ్రామాలను భాగస్వామ్యం చేస్తు దాదాపు 5000 వే సంతకాల సేకరణ చేపట్టి ఈనెల 27న గోమాత గౌవర దివస్ సందర్భంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో గోసేవలకు పాల్గొన్నారు.




కరపత్రాలను విడుదల చేస్తున్న గో సేవలకు

## రేపు పూడూరులో భ్రమరాంబా సహిత సోమేశ్వరాలయంలో వార్షికోత్సవాలు

**పూడూరు, ఏప్రిల్ 10, ప్రభాతవార్త :** ఈ నెల 12తేది ఆదివారం పూడూరు మండల కేంద్రంలోని సోమేశ్వరాలయంలో 16వ వార్షికోత్సవ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటి సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఉదయం 5గంటలకు సుప్రభాతం,6గంటలకు నిత్యపూజా కార్యక్రమం,8నుండి 9గంటల వరకు గణపతిపూజా,పుణ్యాహవాచనము,ధ్వజారోహణము,మంటపారాధన,10గంటలకు స్వామివారి రుద్రాభిషేకం,అమ్మవారి కుంకుమార్చన,10-30గంటలకు విద్యార్థులచే భగవద్గీత పఠనము కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.10-30గంటలనుండి 12గంటలవరకు స్వామివారి దివ్యకళ్యాణ మహోత్సవము, మంగళహారతులు, మంత్రపుష్పం,తీర్థప్రసాదవితరణ,మహాప్రసాద స్వీకరణతో కార్యక్రమాలు ముగుస్తాయని వివరించారు.ఇట్టి కార్యమాలకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు,భజన మండలీలు పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## యాడారంలో ఇందిరమ్మఇళ్లు గృహప్రవేశం

**శామీర్‌పేట, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** యాడారం గ్రామంలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లను అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి ప్రారంభించి లబ్దిదారులతో గృహప్రవేశం చేయించారు. శుక్రవారం శామీర్‌పేట మండలం అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని యాడారం గ్రామంలో షెక్ అయిషా హైమద్ దంపతులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావటం సకాలంలో నిర్మించుకోవటంతో గృహప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. పేదలకు స్వంతింటి కలను నెరవేర్చటానికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి రూ.5లక్షలు అందజేసి ప్రభుత్వం ఆర్థికంగ ఆదుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు కమిషనర్ చంద్రశేఖర్, పలువురు కౌన్సిర్లు ఎల్.హనుమాన్‌దాస్‌గౌడ్, ఎస్.జశ్వంత్‌రెడ్డి, గాదె వెంకటేశ, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేశ్, మేడ్చల్ ఎఎంసి డైరక్టర్ తుంకి బిక్షపతి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఆర్.శ్రీనివాస్‌యాదవ్, కోదూరి దినేష్, కె.వినోద్, చిటుకుల రాజశేఖర్‌రెడ్డి, ఎల్.శ్రీకాంత్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



యాడారంలో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి,పాల్గొన్న జిల్లా ఆర్టీఎ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి,పార్టీ అధ్యక్షులు, కౌన్సిలర్లు, దృశ్యం

## సామాజిక ఉద్యమాలకు వెన్నుదన్నుగా నిలుద్దాం



విరాళం సేకరిస్తున్న సిఐటియు నాయకుడు రాజు

**షాద్‌నగర్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త :** పాలకుల కార్మిక వ్యతిరేక విధానాలను కార్మికవర్గ ఐక్యత ద్వారనే త్రిప్పి కొట్టగలమని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్ రాజు, జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ మల్లేష్‌లు అన్నారు. నాట్కో ఫార్మా కెమికల్ డివిజన్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఈరోజు కంపెనీ గేటు ముందు యూనియన్ ప్రధాన కార్యదర్శి జైపాల్ రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించి సామాజిక సంఘీభావ నిధి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం కార్మికవర్గానికి వ్యతిరేకంగా తెచ్చిన లేబర్ కోడ్స్ వల్ల పర్మినెంట్ ఉద్యోగులస్థానంలో స్టయిఫండ్ ఇచ్చిపని చేయించుకునే పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంలో యువ కార్మికులు, యువ నాయకత్వాన్ని అభివృద్ధి చేసుకోవలసిన అవసరమున్నదని చెప్పారు. అనంతరం సిఐటియుఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈనెల 8, 9, 10 తేదీలలో తలపెట్టిన సామాజిక ఉద్యమ సంఘీభావ పిలుపులో భాగంగా వారు స్వయంగా కార్మికుల నుండి విరాళాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు హరికుమార్, శ్రీశైలం, కీర్యా, కిషోర్, కోటేశ్వరరావు, గణేష్, సతీష్, సుబ్బారావు, రమేష్ శ్రీనివాస్ రెడ్డి, వెంకట్రావు, మల్లేష్, మధు,ఆలీ, కిరణ్, రామరాజు, యాదగిరి,శంకర్, యాదయ్య, రాజు కమిటీ సభ్యులు కార్మికులు పాల్గొన్నారు.

## త్వరలో షాద్ నగర్ మున్సిపాలిటీ ఇంటికి ఇంటికి పిఎన్జీ గ్యాస్ కనెక్షన్

**షాద్‌నగర్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపాలిటీ 23వార్డులో షాద్నగర్ మున్సిపాలిటి డిపిఎన్జీ ( డొమెస్టిక్ పైపుడ్ నేచురల్ గ్యాస్ ) అండర్ గ్రౌండ్ గ్యాస్ పైప్ లైన్ సిస్టమ్ ఏర్పాటులో భాగంగా పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. గ్యాస్ పిఎంజి కనెక్షన్ బరువున్న సిలిండర్లతో ఇబ్బంది పడకుండా, నేరుగా పైపు ద్వారా మీ వంటింటికి సురక్షితమైన గ్యాస్ సరఫరా. అత్యంత భద్రతా ప్రమాణాలతో, 24/7 అందుబాటులో ఉంటుంది. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పెంటయ్య, కాలనీ వాసులు , కల్వ యాదగిరి,శేఖర్, అగ్గనూర్ నందు,కాపర్తి ప్రవీణ్, కైలాష్ నాథ్,పానుగంటి వెంకటేష్, మల్లేష్, రాకేష్, మాధవచారి,గంతల శివ రాజ్,తదితరులు పాల్గొన్నారు.




పిఎన్జీ గ్యాస్ కనెక్షన్ గురించి వివరిస్తున్న మున్సిపల్ చైర్మన్

## జ్యోతి ఎడ్యుకేటెడ్ యూత్ చలివేంద్రం

**యాచారం,ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** యాచారం మండల పరిధిలోని నంది వనపర్తి గ్రామంలో జ్యోతి ఎడ్యుకేటెడ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యూత్ అధ్యక్షులు నూకం కృష్ణ మాట్లాడుతూ..తీవ్ర ఎండలతో ప్రజలు, ముఖ్యంగా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్న ఈ పరిస్థితుల్లో గ్రామంలోని ఓంకారేశ్వరాలయం బస్ స్టాండ్ వద్ద ప్రయాణికుల దాహాన్ని తీర్చేందుకు జ్యోతి ఎడ్యుకేటెడ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ప్రజల సేవే పరమావధిగా భావిస్తూ వేసవి కాలంలో చల్లని తాగునీరు అందించడం ద్వారా ఈ యూత్ అసోసియేషన్ సమాజానికి ఒక ఆదర్శంగా నిలుస్తోందన్నారు.ప్రతి ఒక్కరూ ఇలాంటి సేవా కార్యక్రమాలలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా కోరుతునామాన్ని అన్నారు. జ్యోతి ఎడ్యుకేటెడ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జెనిగే శ్రీశైలం గారు, నాయకులు తెలుగమల్ల రవిదర్ ,వార్డ్ సభ్యులు నిట్టి బీరప్ప , మూలి రమేష్, యంజాల చంద్రకాంత్ , నూకం మహేందర్ , కొండాపురం దానయ్య, యాదయ్య గారు, బాలరాజు , శివ , గడల అనంతం, పంది రాములు, ఇంజామల్ల దాసు , రాందాసు, ఎండీ షహీద్, నేత్రా శ్రీశైలం , శ్రవణ్ , సామ మధుకర్, తదితరులు పాల్గొన్నారు.




చలివేంద్రం ప్రారంభిస్తున్న జ్యోతి ఎడ్యుకేటెడ్ యూత్ సభ్యులు

## గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

**సర్పంచ్ మస్కు అనిత శరణం**

**యాచారం,ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** యాచారం గ్రామపంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్ది అభివృద్ధి పథంలో నడుపుతామని సర్పంచ్ మస్కు అనిత శరణం అన్నారు. శుక్రవారం గ్రామంలోని పలు అభివృద్ధి పనులను సర్పంచ్ ఉప సర్పంచ్, వార్డు సభ్యుల, సెక్రటరీ కిషన్ నాయక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి సహకారంతో యాచారం గ్రామపంచాయతీలో టి ఎస్ ఎస్ ఐ జి సి ఒక కోటి 50 లక్షల నిధులతో సిసి రోడ్ల అండర్ డ్రైనేజీల పనులు జరుగుతున్నాయన్నారు. గతంలో ఎన్నడు లేని విధంగా యాచారం గ్రామపంచాయతీకి అధిక నిధులు మంజూరు చేయిస్తూ గ్రామంలో నూటికి నూరు శాతం సిసి రోడ్లు అండర్ డ్రైనేజీల పనులు పూర్తి చేస్తున్న మని అన్నారు. అధిక నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు సర్పంచ్ వార్డు సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



సిసి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు సభ్యులు